ప్రజాశక్తి
గురువారం 16 నవంబరు 2023
5
శ్రీకాకుళం

శబరిమల, పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

శ్రీకాకుళం అర్బన్ : కార్తీక మాసంలో పంచారామ క్షేత్రాలు, శబరిమలకు వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం ఆర్‌టిసి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శబరిమలకు వచ్చే ఏడాది జనవరి 20వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. పంచారామ క్షేత్రాలకు ఈనెల 19, 26, డిసెంబరు 3, పదో తేదీల్లో పలాస, టెక్కలి, శ్రీకాకుళం డిపోల నుంచి ప్రత్యేక బస్సులు బయలుదేరుతాయని తెలిపారు. శబరిమల యాత్రికుల కోసం ఏడు రోజులు, 11 రోజుల యాత్రకు బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ 9959225608, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) 7095040608, రెండో డిపో మేనేజర్ 9959225609, ఎఎం (ట్రాఫిక్) 7382917289, టెక్కలి డిపో మేనేజర్ 959225611 ఎఎం (ట్రాఫిక్) 7382923311, పలాస డిపో మేనేజర్ 9959225610, ఎఎం 7382924758 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

మడ్డువలస పనులకు బ్రేక్

- తాత్కాలికంగా ఆగిన రెండో దశ
- కాలువ తవ్వకాలకు రాని మైనింగ్ అనుమతులు
- స్ట్రక్చర్ల నిర్మాణాలకు ముందుకు రాని నిర్మాణ సంస్థ
- జనవరి నాటికి పూర్తి కావడంపై సందేహాలు

మడ్డువలస రెండో దశ పనులకు తాత్కాలికంగా బ్రేక్‌లు పడ్డాయి. పొందూరు మండలంలో పలు ప్రాంతాల్లో బండరాళ్ల తొలగింపునకు మైనింగ్ శాఖ నుంచి అనుమతులు రాకపోవడంతో, కాలువ తవ్వకాలు నిలిచిపోయాయి. ప్రాజెక్టు పనులు చేస్తున్న సంబంధిత కాంట్రాక్టర్ పెద్దగా ఆసక్తి చూపకపోవడం కూడా పనులు ముందుకు సాగకపోవడానికి మరో కారణంగా ఉంది. కాలువ తవ్వకాలకు అధికారులు భూమిని సేకరించినా, రైతులకు డబ్బులు ఇవ్వకపోవడం పనులు ఆగిపోవడానికి దారితీసింది. ప్రస్తుతం చేపట్టిన పనులు పరిశీలిస్తే నిర్దిష్ట సమయానికి పూర్తి కావడంపై అనేక సందేహాలు నెలకొన్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

మడ్డువలస జలాశయ రెండో దశ పథకాన్ని నిర్మించాలని 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. జనవరి 6, 2009లో రూ.57.87 కోట్లకు పరిపాలనా ఆమోదం కూడా తెలిపింది. జి.సిగడాం, పొందూరు, లావేరు, ఎచ్చెర్ల, మండలాల్లోని 24,954 ఎకరాలకు సాగునీందించాలన్నది ఈ పథకం ప్రధాన ఉద్దేశం. దీంతో మొత్తం 21 గ్రామాలకు తాగునీరు అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. పథక నిర్మాణ బాధ్యతలను విశాఖపట్నానికి చెందిన పి.జె.ఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ టెండర్లలో రూ.47.3933 కోట్లకు దక్కించుకుంది. మార్చి 2, 2009న ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందం ప్రకారం పనిని 24 నెలల కాలంలో పూర్తి చేయాల్సి ఉంది. అంటే మార్చి 2, 2011 నాటికే పనులు పూర్తయి రైతులకు సాగునీరు అందించాల్సి ఉంది. ఒప్పంద కాలపరిమితులు పొడిగిస్తూ ప్రభుత్వం వరుసగా ఆరు పర్యాయాలు అవకాశమిచ్చింది.

లావేరు మండలం కొత్తకుంకాం వద్ద తవ్వి వదిలేసిన కాలువలు

చివరిసారిగా కాలపరిమితిని జూన్ 30, 2018 వరకు పొడిగించింది. అధికారిక లెక్కల ప్రకారం 78.36 శాతం పనులు పూర్తయ్యాయి. మరో 21.64 శాతం పనులు మిగిలి ఉన్నాయి. ఒప్పందం విలువ రూ.47.393 కోట్లలో రూ.37.14 కోట్లు ఖర్చు చేశారు. ప్రస్తుతం సంబంధిత నిర్మాణ సంస్థ పనులు నిలుపుదల చేసింది. దీంతో ప్రభుత్వం జూలై 8, 2020లో సంబంధిత నిర్మాణ సంస్థతో ఒప్పందాన్ని ముగించింది.

కొత్త నిర్మాణ సంస్థకు పనులు అప్పగింత

రిజర్వాయర్ పనులు చేపట్టిన పిజెఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఇప్పటివరకు 78.36 శాతం మేర పనులు పూర్తి చేసి వైదొలగింది. మిగిలిన 21.64 శాతం పనులు చేసేందుకు కొత్త నిర్మాణ సంస్థకు పనులు పనులు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాలతో ఇంజినీరింగ్ అధికారులు మిగిలిన పనులకు కొత్త రేట్లకు అనుగుణంగా అంచనాలను రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వం వాటికి ఆమోదం తెలిపి రూ.26.90 కోట్లను మంజూరు చేస్తూ 2022 ఏప్రిల్ 25వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. స్టేజ్-2లో అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను పూర్తి చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన బిఎన్‌బి ఇన్‌ఫ్రా ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ రూ.23.83 కోట్లతో టెండర్లను దక్కించుకుంది.

జనవరికి పూర్తి కావడం సందేహమే

మడ్డువలస పనులు చేస్తున్న సంబంధిత కాంట్రాక్టర్ నిరాసక్తత కనబరుస్తున్నట్లు తెలిసింది. బిల్లులు వస్తాయో లేదోనన్న సందేహంతో వెనుకడుగు వేస్తుండడంతో, పనులు ముందుకు సాగడం లేదు. పది కిలోమీటర్ల మేర కాలువ తవ్వాల్సి ఉండగా, నాలుగు కిలోమీటర్లు తవ్వారు. కాలువపై 250 స్ట్రక్చర్లు నిర్మించాల్సి ఉండగా, ఇప్పటివరకు ఒక్కటీ నిర్మించలేదు. కొత్తగా పనులు మొదలైన తర్వాత ఐదు శాతం మాత్రమే పూర్తయ్యాయి. కొత్త ఒప్పందం ప్రకారం వచ్చే ఏడాది జనవరిలోగా పనులు పూర్తి కావాల్సి ఉంది. పనులు జరుగుతున్న పరిస్థితి చూస్తే ఆరు నెలల పాటు పొడిగించాల్సి వస్తుందనే అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

అడుగడుగునా అవాంతరాలే...

మడ్డువలస పనులను 2009లో ప్రారంభించి 2020 జూలై వరకు 78.36 శాతం జరిగాయి. రెండో దశ పూర్తి కావాలంటే మరో 21.64 శాతం పనులు పూర్తి చేయాలి. మిగిలిపోయిన పనులను ప్రభుత్వం కొత్త నిర్మాణ సంస్థకు పనులు అప్పగించింది. ఈ ఏడాది ఏప్రిల్ 24న మడ్డువలస పున:ప్రారంభ పనులకు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం శంకుస్థాపన చేశారు. అప్పట్నుంచి మొదలైన పనులు మందకొడిగానే సాగుతున్నాయి. ఇది చాలదన్నట్లు పనులకు రకరకాల ఆటంకాలు కలుగుతున్నాయి. పొందూరు మండలం విఆర్ గూడెం, ధర్మపురం, వావిలపల్లిపేట, ప్రాంతాల్లో కాలువ తవ్వకాలకు బండరాళ్లు అడ్డు రావడంతో వాటిని పేల్చి తొలగించాల్సి ఉంది. మైనింగ్ శాఖకు దరఖాస్తు చేసినా ఇంకా అనుమతులు ఇవ్వలేదు. రైతుల నుంచి తీసుకున్న భూములకు రూ.2.25 కోట్లను చెల్లించకపోవడంతో కాలువ తవ్వకాలు ఆగిపోయాయి.

మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

పెన్షనర్ల సమస్యలపై పోరాటం

ఎస్‌జిపిఎ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్ల అసోసియేషన్ నిరంతరాయంగా పోరాడుతుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు అన్నారు. నగరంలోని ఎన్‌జిఒ హోంలో బుధవారం జిల్లాస్థాయి పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘంలో గతంలో కొందరు నాయకులు వ్యక్తిగత ప్రాపకం కోసం పనిచేస్తూ పెన్షనర్లకు ఇబ్బందుల పాల్జేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘానికి ఏక నాయకత్వం ఉండడం వల్ల ఈ పరిస్థితి ఎదురైందన్నారు. న్నికలను సైతం నిర్వహించకుండా తమను తామే నాయకులుగా ప్రకటించుకుని స్వార్థ ప్రయోజనాల కోసం పెన్షనర్ల సమస్యలను పక్కన పెట్టారన్నారు. పెన్షనర్లకు నాలుగు ప్రధాన సంఘాలు ఉన్నాయని, పిఆర్‌సి కోసం ఈ సంఘాలు పోరాడుతున్నా ప్రభుత్వాలు మాత్రం స్పందించకపోవడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల న్యాయమైన హక్కులను పరిష్కరించకుండా అణగదొక్కుతుందన్నారు. ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో ఉద్యోగుల కన్నా ప్రభుత్వ పెన్షనుదారులే ఎక్కువగా ఉన్నారని అన్నారు. వారి సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తే ఉద్యోగ సంఘంగా పూర్తి మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. ఉద్యోగులకు, పెన్షనర్లకు ప్రతినెలా 1న జీతాలు చెల్లించాలన్నారు. సమావేశంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.శర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాఘవరావు, జిల్లా అధ్యక్షుడు ఆర్.రామచంద్రరావు, కార్యదర్శి డి.ధర్మారావు, కోశాధికారి బి.మోహనరావు, పొందూరు అప్పారావు, కార్యదర్శి సూర్యప్రకాశరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.శాంతారావు, గౌరీకాంతారావు, జగన్నాథరావు పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఓటర్ల నమోదుపై పలు రాజకీయ పార్టీలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 18,28,410 మంది ఓటర్లు ఉన్నట్లు వివరించారు. శాసనసభా నియోజకవర్గాల్లో ఈనెల 8 నుంచి 13వ తేదీ వరకు దావాలు, అభ్యంతరాలపై 14,154 దరఖాస్తులు స్వీకరించినట్లు వెల్లడించారు. చేర్పులకు సంబంధించి ఇప్పటివరకు 18,531, తొలగింపులకు 6,409, దిద్దుబాటుకు 12,133 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఎక్కువ పెండింగ్‌లో ఉన్న మండల తహశీల్దార్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలన్నారు. గార మండలం మొగదలపాడులో పోలింగు కేంద్రం మార్పు అవకాశాన్ని పరిశీలిస్తామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు సందేహాలు ఉంటే నివృత్తి చేస్తామన్నారు. తొలగింపులకు సంబంధించి ఫారాలు ఉంటే తప్ప తొలగించలేమని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, వైసిపి నాయకులు రౌతు శంకరరావు, టిడిపి నాయకులు కె.వి రామరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు డి.గోవింద మల్లిబాబు, బిఎస్‌పి నాయకులు బి.నారాయణరావు, సి-సెక్షన్ సూపరింటెండెంట్ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్

వంశధార భూసేకరణ యూనిట్-4ను కొనసాగించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వంశధార భూసేకరణ యూనిట్-4ను కొనసాగించాలని రెవెన్యూ సర్వీసుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.శ్రీరాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.వేణుగోపాల్ రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావును కోరారు. పెద్దపాడులోని క్యాంపు కార్యాలయంలో బుధవారం మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. వంశధార ప్రాజెక్టు కోసం 2005లో నాలుగు భూసేకరణ యూనిట్లను ప్రభుత్వం నెలకొల్పిందని తెలిపారు. వీటిలో రెవెన్యూ, ల్యాండ్ సర్వే విభాగం ఉద్యోగులను నియమించి భూసేకరణ చేపట్టిందని గుర్తుచేశారు. ఒక్కో యూనిట్‌లో 35 మంది పలు కేడర్లలో విధులు నిర్వహించేవారని వివరించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, స్పెషల్ డిప్యూటీ తహశీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, ఇతర ఉద్యోగులు నిరంతరాయంగా పనిచేయడం వల్ల ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ దాదాపుగా పూర్తి చేయడమైందని తెలిపారు. గతేడాది మేలో మూడు యూనిట్లను ప్రభుత్వం రద్దు చేసిందని, ఈ ఏడాది డిసెంబరు 31తో యూనిట్- 4 గడువు కూడా ముగుస్తుందని వివరించారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, కోర్టు వివాదాలు, చెల్లింపులు, ఇతర సమస్యలను పరిష్కరించేందుకు యూనిట్-4ను మరికొంతకాలం కొనసాగించాల్సిన అవసరం ఉందని వివరించారు.

వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యం

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

వచ్చే ఎన్నికల్లో వైసిపిని ఓడించడమే టిడిపి, జనసేన లక్ష్యమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి, జనసేన టెక్కలి నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. అనంతరం ఆయన జనసేన టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్ కుమార్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రజా వ్యతిరేక పాలనను అంతం చేయడానికి ఉమ్మడి ప్రణాళికతో ముందుకు సాగుతామన్నారు. ఇప్పటికే బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ ప్రజల్లోకి వెళ్తున్నామని చెప్పారు. 2014లో జనసేన పొత్తుతో అధికారంలోకి వచ్చామని, అప్పుడు సాధించిన ప్రగతి గురించి ప్రజలకు వివరిస్తామన్నారు. అనంతరం టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి అచ్చెన్నాయుడు, కిరణ్ పార్టీ కార్యాలయ ఆవరణలోని అన్నా క్యాంటీన్‌లో భోజనం చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, కోటబొమ్మాళి, టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్, బగాది శేషు, పినకాన అజయ్‌కుమార్, జీరు భీమారావు తదితరులు పాల్గొన్నారు.

తమ్మినేని అక్రమాలపై ఛార్జిషీట్

ఆమదాలవలస : శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అవినీతి, అక్రమాలపై పూర్తిస్థాయి ఆధారాలతో ఛార్జిషీట్ తయారు చేసి ప్రజల ముందు దోషిగా నిలబెడతామని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. పట్టణంలోని ఒక కళ్యాణ మండపంలో టిడిపి, జనసేన ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు పేడాడ రామ్మోహనరావుతో కలిసి ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకాల్లో తమ్మినేని అవినీతికి అంతం లేకుండా పోయిందన్నారు. ఆమదాలవలస-శ్రీకాకుళం రోడ్డు పనులకు సంబంధించి ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం, కాంట్రాక్టర్లను కమీషన్ల కోసం వేధిస్తుండడం వల్ల పనులను మధ్యలో విడిచిపెట్టి కాంట్రాక్టరు వెళ్లిపోయారని చెప్పారు. ఈనెల 17న టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు కలిసి గ్రామాల్లో భవిష్యత్‌కు బాబు గ్యారెంటీ కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. 18న రోడ్ల దుస్థితిపై ఉమ్మడిగా నిరసన తెలపనున్నట్లు చెప్పారు. వైసిపి ప్రభుత్వ అవినీతి అరాచకాలను ఎండగడుతూ ప్రజల్లోకి వెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని నిర్ణయించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, టిడిపి నాయకులు మొదలవలస రమేష్, తమ్మినేని విద్యాసాగర్, జనసేన నాయకులు పాత్రుని పాపారావు తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : సమావేశంలో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

తరిమికొట్టడం ఖాయం

పలాస : టిడిపి, జనసేన ఐకమత్యంతో పనిచేసి అధికార వైసిపిని గద్దె దింపుతాయని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌత శిరీష, జనసేన పలాస నియోజకవర్గ ఇన్‌ఛార్జి వి.దుర్గారావు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి, జనసేన పలాస నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరాచక ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కొండలరాజుకు వచ్చే ఎన్నికల్లో రాజకీయాల నుంచి తరిమికొట్టడం ఖాయమన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్, ఎల్.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి కుల గణన

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో అన్ని తరగతులకు చెందిన కులాల వారి సంఖ్యను లెక్కించేందుకు ఈనెల 27 నుంచి గణనను ప్రారంభించనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కుల గణన కోసం ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్‌ను వెల్లడించారు. కుల గణన తర్వాత ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించవచ్చని తెలిపారు. కుల గణనలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొంటారని పేర్కొన్నారు. సచివాలయం పరిధిలో ఉన్న ఇళ్ల వద్దకు వెళ్లి ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారా వారి వివరాలను సేకరిస్తారని తెలిపారు. వారం రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అనంతరం ఆయా సచివాలయ పరిధిలో 10 శాతం ఇళ్లల్లో రీ వెరిఫికేషన్ చేసి గణన వివరాలను సరిపోల్చి చూస్తామని తెలిపారు. ఎన్యుమరేటర్లకు గ్రామ, మండల, డివిజనల్, జిల్లాస్థాయి శిక్షణను ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కుల గణనకు సచివాలయ శాఖ నోడల్ ఏజెన్సీగా ఉంటుందని తెలిపారు. ఒకే విడతలో కుల గణను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సర్వే సమయంలో ఎక్కడైనా మిగిలిపోయిన ఇళ్లు ఉంటే డిసెంబరు పదో తేదీ నాటికి పూర్తి చేయాలని పేర్కొన్నారు. సర్వే సమయంలో ఆధారాల కోసం ఎలాంటి ధ్రువీకరణ పత్రాలను అడగరాదని స్పష్టం చేశారు. వ్యక్తి పేరు, వయసు, లింగం, భూమి (వ్యవసాయ, వ్యవసాయేతర), ఇంట్లోని పశువులు, వృత్తి, అన్నిరకాలుగా వచ్చే ఆదాయం, కులం, ఉప కులం, మతం, విద్యార్హత, నివాసం ఉండే ఇళ్లు, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు, గ్యాస్ ఉందా? లేదా? అనే వివరాలు మాత్రమే సేకరించాలని తెలిపారు. దీనిపై ఈనెల 17న జిల్లాస్థాయి రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

మేలు జరిగితేనే ఓటు వేయండి

- సమర్థ, సమగ్ర, సంక్షేమ పాలన జగన్‌తోనే సాధ్యం
- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు
- కేంద్ర సూచీల్లో రాష్ట్రానిదే అగ్రస్థానం
- శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం
- జిల్లాకు టిడిపి చేసిన అభివృద్ధి శూన్యం
- పశుసంవర్థక శాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి - నరసన్నపేట, పోలాకి

'నాలుగున్నరేళ్ల వైసిపి పాలనలో ప్రతి కుటుంబానికీ ఏదో ఒక సంక్షేమ పథకం రూపంలో మేలు జరిగింది. మీ కుటుంబానికి మేలు జరిగితేనే వచ్చే ఎన్నికల్లో జగన్‌కు ఓటు వేయండి' అని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. రెండో దశ సామాజిక సాధికార బస్సు యాత్రను పోలాకి మండలం మబగాంలో వైసిపి ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి బుధవారం ప్రారంభించారు. అనంతరం నరసన్నపేట పాతబస్టాండ్ వద్ద నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి ధర్మాన మాట్లాడుతూ సమర్థవంతమైన, సమగ్రమైన, సంక్షేమ పాలన జగన్ అందిస్తున్నారని, రాష్ట్రంలో చోటుచేసుకున్న మార్పులను ప్రజలు గమనించాలని కోరారు. ప్రజలకు అవసరమైన వసతులు, సౌకర్యాలను జగన్ పాదయాత్ర చేసినప్పుడు గమనించి, సిఎం కాగానే అమలు చేశారని, ఇందుకోసం ఎవరూ పోరాటాలు చేయలేదని చెప్పారు. చంద్రబాబు కంటే ఐదు రెట్లు అధికంగా జగన్మోహన్ రెడ్డి ఉద్యోగాలు కల్పించారని, వేర్వేరు విద్యార్హతలు కలిగిన వారికి ఉద్యోగాలు ఇవ్వబోతున్నారని తెలిపారు. చంద్రబాబుకు ఓటు వేయాలని ఎవరైనా మీ ఇంటికి వస్తే, అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారో చెప్పాలని ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి విషయంలో ఓట్లడిగిన టిడిపి నాయకులను చర్చకు రమ్మనాలని సూచించారు.

కేంద్ర సూచీల్లో రాష్ట్రానిదే అగ్రస్థానం : స్పీకర్

జగన్ పాలనలో అభివృద్ధి సూచీల్లో రాష్ట్రం అగ్రస్థాయికి చేరిందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. జిడిపి పెరుగుదల అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. అర్హతలే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అర్హులకు అందజేస్తున్నారని చెప్పారు. ప్రజల సొమ్ములను తమ ఖాతాల్లోకి మళ్లించుకుని టిడిపి నాయకులు కుంభకోణాలకు పాల్పడ్డారని ఆరోపించారు. బాబు వస్తే జాబు వస్తుందని చెప్పి స్కిల్ స్కామ్ పేరుతో కోట్ల రూపాయలను దోచుకుని చంద్రబాబు జైలుపాలయ్యారని విమర్శించారు. జగన్‌ని మళ్లీ సిఎం చేసుకోవడం ప్రజల చారిత్రక కర్తవ్యమన్నారు.

జిల్లాకు టిడిపి చేసిందేమిటి?

తమ్మినేని సీతారాంకు స్పీకర్ పదవి ఇస్తే, ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు సీట్లో కూర్చోబెట్టడానికి రాలేదని, సిఎం జగన్ దగ్గరుండి సీట్లో కూర్చొబెట్టి బిసిలకు తాను ఇచ్చే గౌరవం ఏమిటో చాటిచెప్పారని రాష్ట్ర పశు సంవర్థకశాఖ మంత్రి సీదిరి అప్పరాజు అన్నారు. బిసిలను అవమానించిన చంద్రబాబు ఎక్కడ, ఆత్మాభిమానం, ఆత్మగౌరవం నిలిపిన జగన్ స్థానం ఎక్కడో ప్రజలు ఆలోచించాలని కోరారు. 14 ఏళ్లు పాలించిన చంద్రబాబు ఏమీ చేయకపోగా, ఇప్పుడు అధికారం ఇస్తే సంపద సృష్టించేస్తానని మాయమాటలు చెప్తున్నాడని ఎద్దేవా చేశారు.

మాట్లాడుతున్న రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

జిల్లా అభివృద్ధికి టిడిపి చేసింది శూన్యమన్నారు.

జగన్‌ని మళ్లీ సిఎం చేసుకోవాలి : కృష్ణదాస్

రాష్ట్రంలో మంచి పాలన సాగుతోందని ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. విపక్షాలన్నీ కలిసి ప్రజా నాయకుడిని ఓడించడానికి తయారవుతున్నారని మండిపడ్డారు. జగన్‌ను మళ్లీ గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీ వాణి మాట్లాడుతూ బిసిలు, ఎస్‌సిలు, ఎస్‌టిలు, మైనార్టీలు గర్వంగా తలెత్తుకునేలా జగన్ చేశారని కొనియాడారు. వచ్చే ఎన్నికల్లో 175 సీట్లు వైసిపి గెలుచుకోవడం ఖాయమన్నారు. యాత్రలో ఎమ్మెల్యేలు వి.కళావతి, గొర్లె కిరణ్ కుమార్, రెడ్డి శాంతి, ఎమ్మెల్సీలు పాలవలస విక్రాంత్, వరుదు కళ్యాణి, నర్తు రామారావు, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, కార్పొరేషన్ల చైర్మన్లు పేరాడ తిలక్, అంధవరపు సూరిబాబు, డిసిసిబి చైర్మన్ కె.రాజేశ్వరరావు, ధర్మాన కృష్ణచైతన్య, దువ్వాడ వాణి, డోల జగన్ తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM I.P. 13/2023.

Between: **Mavuru Prabhakara Rao** ...Petitioner.
And: **Chintada Indajith & others** --Respondent

To,
R-19. Damodara Bhimudu, S/o late Srinivasarao, Hindu aged about 60 years, Cultivation, Makavaram village, Dhimili Post, Kotturu Mandal, Srikakulam District.
R-21. Isaikoti Ramulamma, W/o late Ramarao, Hindu aged about 55 years, Cultivation, Makavaram village, Dhimili Post, Kotturu Mandal, Srikakulam District.
R-34. Pondhara Bhimudu, S/o late Ramulu, Hindu aged about 65 years, Cultivation, Kotha potnuru village, Dhimile post, Kothuru Mandal, Srikakulam District.
R-35. Pondhara Gopi Nadham, S/o late Parayya, Hindu aged about 70 years, Cultivation, Patha potnuru village, Dhimile post, Kothuru Mandal, Srikakulam District.
R-36. Pondhara Paramma, W/o late Dhinabandhu, Hindu aged about 55 years, Cultivation, Patha potnuru village, Dhimile post, Kothuru Mandal, Srikakulam District.
R-37. Dola Meena, W/o late Minnarao, Hindu aged about 35 years, Household duties, Makavaram village, Dhimile post, Kothuru Mandal, Srikakulam District.

Take notice that the insolvency petition filed by the above named petitioner is posted for hearing at **10.30 AM., on 17-11-2023** before the Honourable Senior Civil Judge Court, Srikakulam, and if you wasn't to contest the matter you may do so either in person or by a duly instructed pleader and if you fail to show cause matter will be decided in your absence and expert.

**PYDI. HARSHA VARDANA
ADVOCATE, SRIKAKULAM,
CELL: 9515975111.**

అధికారులు గైర్హాజరైతే ఎలా?

తహశీల్దార్ తీరుపై స్పీకర్ మండిపాటు

సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి తహశీల్దార్ వి.లక్ష్మీనారాయణ గైర్హాజరవ్వడంపై స్పీకర్ తమ్మినేని సీతారాం ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సరుబుజ్జిలి మండలం డకరవలస, సుభద్రాపురం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్పీకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డకరవలస గ్రామంలో పర్యటిస్తుండగా షలంత్రి గ్రామంలో వై.నారాయణమ్మ అనే వృద్ధురాలు మరణించి రెండు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ అధికారులు కార్డు రద్దు చేయకుండా బియ్యాన్ని స్వాహా చేస్తున్నారని కె.గౌరునాయుడు స్పీకర్ దృష్టికి తీసుకువచ్చారు. స్పీకర్ వెంటనే తహశీల్దార్‌ను పిలవగా కార్యక్రమానికి రాలేదని పలువురు తెలుపడంతో వెంటనే పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్‌ను పిలవగా ఆయన కూడా కార్యక్రమానికి రాకపోవడంతో స్పీకర్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ బాబురావును వివరణ కోరగా తనకేమీ తెలియదని చెప్పడంతో స్పీకర్ మరింత అసహనం వ్యక్తం చేశారు. అనంతరం సుభద్రాపురం గ్రామంలో వంశధార కాలువ నుండి రైతులకు సాగునీరు అందించి పంటలు ఎండిపోకుండా రైతులను ఆదుకోవాలని అక్కడి రైతులు స్పీకర్ దృష్టికి తీసుకువచ్చారు. స్పీకర్ వెంటనే ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి రైతులకు అవసరమైన సాగునీటిని వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. ఎనిమిది నెలలుగా సిఎఫ్ లేకపోవడంతో డ్వాక్రా సభ్యులంతా ఇబ్బంది పడుతున్నామని సిఎఫ్‌ను వెంటనే నియమించాలని మహిళలు స్పీకర్‌ను కోరారు. అనంతరం గడపగడపకు వెళ్లి ప్రజలకు ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు, వైస్ ఎంపిపిలు గోవింద్ శివానందమూర్తి, లావేటి అనిల్ కుమార్, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, ఎంపిడిఒ పివిపి మురళీమోహన్ కుమార్, మూడడ్ల రమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మందసను కరువు మండలంగా ప్రకటించాలి

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మందస: మందసను కరువు మండలంగా ప్రకటించాలని ఎపి జీడి రైతు సంఘం తెప్పల అజయ్‌కుమార్, రైతు సంఘం నాయకులు మహేంద్ర, చైతన్య. బెస్త కామేశ్వరరావు, మామిడి మాధవరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన తెలిపారు. అనంతరం మందసలో పర్యటించిన పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాభావంతో పాటు శాశ్వత నీటి వనరులు లేనందున పంటలు పండడం లేదని అన్నారు. దీంతో రైతులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పండించిన పంటలకు గిట్టుబాటు ధరలేక వలసలు అధికమవుతున్నాయన్నారు. తొలకరిలో కురిసిన వర్షాలకు వరి నాటు వేశారని అన్నారు. సెప్టెంబరు నెలలో పంపు సెట్లు, ఇంజిన్లతో ఎకరా సేద్యానికి రూ.25 వేలు నుంచి రూ.30 వేలు పెట్టుబడి పెట్టి వరినాట్లు వేశారని అన్నారు. నీరు చాలక, వర్షాలు లేక పగుళ్లు ఏర్పడి పంట పూర్తిగా ఎండిపోయని అన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఇన్స్యూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ, రబీ సీజన్‌కు పెసలు, మినుములు, నువ్వులు, వేరుశనగ, పొద్దుతిరుగుడు, చిరుధాన్యాల విత్తనాలు ఉచితంగా అందజేయాలని కోరారు. జీడీ, కొబ్బరి బోర్డులు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. నక్కసాయి, జంతి బంద, సంకుజోడు, గోపాల సాగర్‌లను రిజర్వాయర్లుగా నిర్మించి సాగునీరు అందించాలన్నారు. జెన్నా చెరువు, కొత్తచెరువు, ఈతచెరువు, జంపరగాయి, బెల్లు పటియా ధోని, కళింగ దళ్, డబారుసింగి గ్రోయన్లు, మధుములు, గైరిలలో పూడికలు, ఆక్రమణలు తొలగించి మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ముకుందపురం, పింపిలి, మహేంద్ర తనయ పరిసర గ్రామాల రైతులకు ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించాలని కోరారు. గిరిజన రైతులకు, పొందర కులాలు కాయగూరలు పండించే రైతులకు సామూహిక వ్యవసాయ బోరు బావులు ఉచితంగా ఏర్పాటు చేసి సాగునీరు అందించాలన్నారు. కరువు మండలంగా ప్రకటించి ఎకరాకు రూ.20 వేలు చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కొర్ల హేమారావు చౌదరి, మజ్జి బాబూరావు, దాసరి తాతారావు, ఎం.హడ్డి, సోమనాథం, కంసు కృష్ణమూర్తి, తామడ త్రిలోచనా, శ్రీరాములు, ముకుందరావు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ గిరిబాబు

నెహ్రూ పార్కు అభివృద్ధికి చర్యలు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- పలాస

నెహ్రూ పార్కును సుందరంగా, ఆధునిక హంగులతో తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నామని పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. ఈ నెల 6న 'ప్రజాశక్తి'లో 'రూపం కోల్పోయిన నెహ్రూ పార్కు' కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన పురపాలక సంఘం అధికారులు స్పందించారు. రూ.పది లక్షలు నిధులు మంజూరు చేశారు. దీంతో పనుల ప్రారంభానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పార్కు చుట్టూ లైటింగ్, కోనేరులో స్టెప్స్, కూర్చోడానికి టేబుళ్లు, తాగునీరు తదితర పనులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. పలాస మున్సిపాలిటీలో ఏకైక పార్కు నెహ్రూ అని, ఈ పార్కును పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, మన్మథ పాల్గొన్నారు.

చదవడం, రాయడం నేర్పించాలి

మాట్లాడుతున్న ఉపేందర్‌రెడ్డి

ప్రజాశక్తి, టెక్కలి

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థుల్లో ప్రతి ఒక్కరికి చదవడం, రాయడం నేర్పించాలని సర్వశిక్ష అభియాన్ రాష్ట్ర పరిశీలకులు ఉపేందర్ రెడ్డి కోరారు. టెక్కలి డివిజన్ స్థాయి ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారుల రెండు రోజుల శిక్షణా సదస్సు బుధవారంతో ముగిసింది. స్థానిక బాలికోన్నత పాఠశాలలో జరిగిన శిక్షణ శిబిరాన్ని ఉద్దేశించి ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యా సంవత్సరం చివరినాటికి ఉపాధ్యాయులు తమ లక్ష్యాన్ని నెరవేర్చుకోవాలన్నారు. రాష్ట్ర మోనిటరింగ్ అధికారి కల్పనా సేల్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు లెసన్ ప్లాన్, టీచింగ్ నోట్స్ ఉండాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శిక్షణలో తెలుసుకున్న అంశాలపై ప్రతి ఒక్కరు పర్యవేక్షణ చేపట్టాలన్నారు. టెక్కలి డివిజన్ ఉప విద్యాశాఖాధికారిని గార పగడాలమ్మ అధ్యక్షతన నిర్వహించిన ఈ శిక్షణ శిబిరంలో రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ ప్రవీణ్ కుమార్, నలినీకాంత్, డివిజన్‌లోని 16 మండలాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

అందరివాడు గౌతు లచ్చన్న

కవిటి : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న అందరివాడని మాజీ మంత్రి గౌతు శివాజీ, ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఎవి రామకృష్ణ, శ్రీశయన కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ డిపి దేవ్ అన్నారు. మండలంలోని రాజపురం గ్రామంలో శ్రీశయన సంఘం, బాల గణేష్ యువజన సంఘం ఆధ్వర్యంలో గౌతు లచ్చన్న నూతన విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సర్పంచ్ సనపల జానకిరావు, డాక్టర్ వెంకటేష్, శ్రీశయన కుల సంఘ జిల్లా అధ్యక్షుడు దీనబంధు, ఎంపిటిసి సతీష్, శ్రీశయన కార్యవర్గ జిల్లా సభ్యులు రాము, తాతయ్య, ఇంద్రరావు, ఆనంద్, ధర్మరాజు, రాజేష్, నారాయణ, రమణ, మోహనరావు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అర్హులైన పేదలందరికీ సొంతింటి కల నెరవేరేంచందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం పెద్దపాడులోని క్యాంపు కార్యాలయంలో సింగుపురం గ్రామ పంచాయతీ పరిధిలోని 80 కుటుంబాలకు బుధవారం ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా పట్టాలు తీసుకున్న ప్రతి కుటుంబమూ సొంతంగా ఇళ్లు కట్టుకుని స్థిర నివాసాన్ని ఏర్పర్చుకోవాలని సూచించారు. పాలన పరంగా తీసుకుంటున్న నిర్ణయాలతో మంచి ఫలితాలు వస్తున్నాయని, అవి ప్రజలకు ఎంతగానో మేలు చేస్తాయని అన్నారు. పథకాల అమలుతో జీవన ప్రమాణాలు పెరిగాయని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎన్.వెంకటరావు, వైసిపి నాయకులు అంబటి శ్రీనివాసరావు, రాజారావు, నాయకులు పాల్గొన్నారు.

పట్టాలను అందజేస్తున్న మంత్రి ధర్మాన

మాట్లాడుతున్న ఎస్ఐ గోవిందరావు

ఉపన్యాస పోటీలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక స్వర్ణభారతి విద్యాసంస్థలతో పోలీసుశాఖ నిర్వహించిన 'మానవహక్కులు- సోషల్ మీడియా, పోలీసు-న్యాయశాఖ పాత్ర' అనే అంశంపై ఉపవ్యాస పోటీలు నిర్వహించారు. స్వర్ణభారతి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్ఐ గోవిందరావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. మానవ హక్కులే కాకుండా భాధ్యతతో కూడిన విధులు కూడా ఉన్నాయని, 1948 డిసెంబరు 10న విశ్వమానవ హక్కుల ప్రకటన జరిగిందన్నారు. స్వర్ణభారతి విద్యా సంస్థల చైర్మన్ తులసీదాస్‌రెడ్డి మాట్లాడుతూ వ్యక్తుల హక్కులకు ఉల్లంఘన జరిగినప్పుడు న్యాయశాఖ రక్షణగా ప్రతి ఒక్కరికి నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో స్వర్ణభారతి హైస్కూల్ ప్రిన్సిపాల్ గౌరి శంకర్ రెడ్డి, స్వర్ణ భారతి జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ జయ ప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరాచక ప్రభుత్వాన్ని తరిమికొట్టాలి

లావేరు : పోస్టర్‌ను అందజేస్తున్న కళావెంకటరావు

మెళియాపుట్టి : పోస్టర్‌ను అందజేస్తున్న వెంకటరమణ

ప్రజాశక్తి- లావేరు

రాష్ట్రంలో కొనసాగుతున్న అరాచక ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో ఓట్లుతో తరిమికొట్టాలని మాజీమంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, ఎచ్చెర్ల ఇన్‌ఛార్జి కిమిడి కళావెంకటరావు అన్నారు. మండలం అదపాకలో బుధవారం రాత్రి బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు అందజేసి సూపర్ సిక్స్ మేనిఫెస్టోలో పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సహజ వనరులను వైసిపి లూటీ చేస్తుందన్నారు. ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ అరాచకం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. మరలా రాష్ట్రంలో అభివృద్ధి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని, ప్రజలంతా ఎన్నికల్లో చంద్రబాబుని ముఖ్యమంత్రిగా చేసేందుకు ఎదురు చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు, మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, మాజీ ఎఎంసి చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, మాజీ ఎంపిపి మీసాల వెంకటరమణ, మాజీ జెడ్‌పిటిసి మధుబాబు, నడిమింటి చార్లస్, లంకలపల్లి జగ్గన్నదొర, కె.రమణనాయుడు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని గొట్టిపల్లి, కూర్మన్నపేట గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టిడిపి అమలు చేయనున్న పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు భాస్కర్‌గౌడ, జిల్లా మహిళా ఉపాధ్యక్షులు బూర్ల లలిత కుమారి, ఉర్లాన వసంత్, మాలతి శ్రీధర్, పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: పెరిగిన ధరలు తగ్గాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, లేకుంటే కష్టాలు మరింత పెరుగుతాయని టిడిపి నాయకులు బోర అప్పారావు, చింతాల సింహాచలం, మస్తాన్‌లు అన్నారు. మండలంలోని పాకివలసలో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను అందజేశారు. ఆలాగే కోటబొమ్మాళి వైశ్యుల వీధిలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరావు, పెద్దబమ్మిడి, హరిశ్చంద్రపురం, సరియాపల్లి, తిలారు గ్రామాల్లో టిడిపి నాయకులు తర్ర రామకృష్ణ, వెలమల కామేశ్వరరావు, హనుమంతు అప్పలరాజు నిర్వహించారు. కార్యక్రమంలో కోరాడ పెద్దగోవింద, ఎస్.రాంకుమార్, చిన్నగోవింద, దేవాది సింహాద్రి, కమ్మకట్టు అప్పలరాజురెడ్డి, తంగుడు సునీల్, పట్నాయక్ అను పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

మాట్లాడుతున్న రామారావు

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వ సంస్థల్లో పని చేసి ఉద్యోగ విరమణ పొందిన పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అప్పారావు కోరారు. కాశీబుగ్గ సబ్ ట్రెజరీ కార్యాలయంలో పెన్షనర్లతో సబ్ ట్రెజరీ అధికారి లక్ష్మీపురం రామారావు అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన పరిధిలో 943 మంది పెన్షనర్స్ ఉన్నారని, వారికి ఎదురైన సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానమని అన్నారు. ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ కుమార్ నాయక్ మాట్లాడుతూ 2021 నుంచి విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులకు హెర్బ్ ఆప్షన్‌లో పే స్లిప్పులు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించాలన్నారు. సమావేశంలో కుమార్ నాయక్, పెన్షనర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు నర్సింగరావు, కార్యదర్శులు సత్యనారాయణ, మోహనరావు, తెప్పల కృష్ణమూర్తి, సలహాదారులు దుర్యోధన, సుందరరావు, సబ్ ట్రెజరీ అధికారి త్రివేణి, భాగ్యలక్ష్మి, భువనేశ్వర్ పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

అంగన్వాడీ కేంద్రాల్లో మెరుగైన సేవలు అందించాలని జిల్లా ఐసిడిఎస్ పీడీ శాంతిశ్రీ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టెక్కలి ఐసిడిఎస్ ప్రాజెక్ట్‌స్థాయి అధికారులు, సూపర్ వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కేంద్రాల్లో లబ్ధిదారులకు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందించాలన్నారు. నాడు-నేడు ద్వారా అంగన్వాడీ భవనాల పనులుపై సమీక్షించారు. సమావేశంలో పిఒ శోభారాణి, సిబ్బంది ఉన్నారు.

సిబ్బందితో సమీక్షిస్తున్న పీడీ శాంతిశ్రీ

నూతన భవనాలు ప్రారంభం

భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండలంలో వేల్పురాయి గ్రామంలో ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులు రూ.40లక్షలతో నూతన గ్రామ సచివాలయం భవనం, రూ.21.80 లక్షల వ్యయంతో రైతుభరోసా కేంద్రం భవనం, రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్‌ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి రైతుల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరాము నాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి చిల్ల వెంకటరెడ్డి, వైస్ ఎంపిపి రాయపురెడ్డి బుజ్జి, స్పెషల్ ఆఫీసర్ దుర్గారావు, ఎంపిడిఒ రమణమూర్తి, ఎఒ ధనుంజయరావు, పంచాయతీ డిఇఇ సీతంనాయుడు, పంచాయతీ జెఇ కుర్మానాథం, వ్యవసాయ అధికారి డి.విజయ్ భాస్కరరావు, స్థానిక సర్పంచ్ బాలి శ్రీను, ఎంపిటిసి ప్రతినిధి గురాన ప్రసాద్, అర్జునవలస సర్పంచ్ మీసాల రామునాయుడు, దేవరాపల్లి సర్పంచ్ మీసాల శ్రీనువాసరావు, అర్జునవలస సర్పంచ్ మీసాల రామునాయుడు, వైసిపి నాయకులు కెల్ల రామకృష్ణ, యలకల అయ్యప్పలనాయుడు, మీసాల రామకృష్ణ, పిన్నింటి చక్రధర్, కెల్ల కృష్ణారావు, మీసాల తవిటినాయుడు, మీసాల రమేష్, పెద్దింటి వెంకటస్వామి పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

టిడిపి కండువా వేస్తున్న అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో నందిగాం మండలం అన్నాపురం పంచాయతీకి చెందిన వైసిపి నాయకులు గేదేల కాంతారావు, విషంపల్లి తిరుపతిరావు, మన్మధరావు, కాంతారావులు బుధవారం టిడిపిలో చేశారు. వీరికి పార్టీ కార్యాలయంలో కండువ వేసి ఆహ్వానించారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నందిగాం, టెక్కలి మండలాల టిడిపి అధ్యక్షుడు పినకాన అజయ్‌కుమార్, బగాది శేషగిరిరావు, మల్లా బాలకృష్ణ పాల్గొన్నారు.

జగనే ఎందుకు కావాలంటే...

ప్రజాశక్తి- కవిటి

రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అవినీతి రహితంగా సంక్షేమ పథకాల అమలు, విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆర్థికసాయం, రాష్ట్రంలోని ప్రతి మహిళకు ప్రత్యేక గుర్తింపు ప్రస్తుత ప్రభుత్వంలోనే సాధ్యమైందని అందుకే మళ్లీ జగనే అధికారంలోకి రావాలని ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ అన్నారు. మండలం బిజి పుట్టుగ గ్రామంలో బుధవారం జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పార్టీ జెండా ఎగరేసి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, లబ్ధి పొందిన కుటుంబాల వివరాలు తెలిపారు. అనంతరం గ్రామంలో తిరిగి ప్రతి ఓటరుకు వైసిపి ప్రభుత్వం విధి విధానాలు అమలు చేసిన సంక్షేమ పథకాలు, పూర్తిస్థాయిలో అమలు జరిపిన మేనిఫెస్టో వివరాలు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.ప్రకాష్, పిఎసిఎస్ అధ్యక్షుడు దేవరాజు సాహు, ఎఎంసి వైస్ చైర్మన్ వై.నీలయ్య, వైస్ ఎంపిపి కర్రి గోపయ్య, ఎంపిటిసి కృష్ణారావు, ఎంపిడిఒ సూర్యనారాయణ రెడ్డి, నాయకులు ఎన్ని అశోక్, జల్లు యుగంధర్, ఇఒపి ఆర్‌డి శివాజీ పాణిగ్రాహి, సచివాలయం కన్వీనర్లు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

పొందూరు : పథకాలను తెలియజేస్తున్న నాయకులు

ఇచ్ఛాపురం: మండలం కేసుపురం గ్రామ పంచాయతీలో వై నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, పార్టీ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి అధ్వర్యంలో పార్టీ పతాకం ఆవిష్కరించారు. గ్రామంలో పర్యటించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలు తీరుపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైసిపి నేతలు గుజ్జు ఢిల్లీరావు, సెల్ల దేవరాజు పాల్గొన్నారు.

పొందూరు: గడపగడపకు సంక్షేమ పథకాలను అందజేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్ కుమార్ అన్నారు. మండలం రాపాక గ్రామంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి కొంచాడ గిరిబాబు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, వైస్ ఎంపిపి ప్రతినిధి వండాన వెంకటరావు, ఎంపిటిసి-2 ప్రతినిధి కోట నాగరాజు, వైసిపి నాయకులు కొంచాడ గాంధీ, ఇప్పిలి రామారావు, వాలంటీర్లు పాల్గొన్నారు.


కవిటి : సంక్షేమ పథకాల వివరాలు చూపుతున్న ప్రకాష్

సమస్యల పరిష్కారానికి పల్లెనిద్ర

సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అర్హులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోదామని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు అన్నారు. మండలంలోని గంగరాం పంచాయతీలో మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజుల ఆధ్వర్యాన బుధవారం పల్లినిద్ర నిర్వహించారు. గ్రామ స్థాయిలో ప్రజలు పడుతున్న బాధలను, పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. అంతకుముందు సంక్షేమ పథకాలకు సంబంధించిన బోర్డును ప్రారంభించారు. జెడ్‌పిటిసి దుప్ప వెంకటరావు, ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్ సర్పంచ్ పేడాడ వెంకటరావు, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, వైఎస్ ఎంపిపి దుక్క రోజా, రామకృష్ణ, జెసిఎస్ కన్వీనర్ గడ్డవలస నాగభూషణరావు, కవిటి రామరాజు, మండల విప్ బొడ్డు అప్పన్న, ఇఒపిఆర్‌డి బి.రామారావు పాల్గొన్నారు.

అమీర్‌బాషా మృతదేహం

అనుమానాస్పదస్థితిలో క్లీనర్ మృతి

ప్రజాశక్తి- పలాస

పలాస జాతీయ రహదారిపై నెమలి నారాయణపురం వద్ద ఆగి ఉన్న లారీలో కడప జిల్లా ప్రొద్దుటూరుకు క్లీనర్ ఎస్.అమీర్ బాషా (41) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని కాశీబుగ్గ పోలీసులు తెలిపారు. ఇచ్ఛాపురం నుంచి బొగ్గు లోడుతో నర్సీపట్నం వెళ్తున్న లారీలో క్లీనర్ నిద్రిస్తున్నాడు. నెమలి నారాయణపురం దగ్గరకు రాగానే డ్రైవర్ గాలి ఉన్నది, లేనిది లారీ టైర్లను పరిశీలించారు. ఈ సమయంలో నిద్రలో ఉన్న క్లీనర్ అమీర్ భాష లేపగా ఎప్పటికీ మేల్కొలేదు. దీంతో అనుమానం వచ్చింది. వెంటనే పోలీసులకు సమాచారమివ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న క్లీనర్‌ను ఆస్పత్రికి తరలించారు. హెచ్‌సి సీతారాం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని లైదాం పంచాయతీ కొల్లిపేటకు చెందిన కొల్లి జనార్ధనరావు బుధవారం ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. తండ్రి మరణించడంతో తల్లి ఉమాతో ఉంటున్న జనార్ధన్ ఇంటర్ వరకు చదివాడు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో పరీక్ష తప్పాడు. అయితే కుటుంబపోషణకు తల్లిపై ఆధారపడడం, ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని కుటుంబసభ్యులు తెలిపారు. పురుగులమందు తాగిన జనార్ధన్‌ను పొందూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదుచేసి ఆస్పత్రి వద్ద విచారణ జరిపారు.

పట్టపగలు చోరీ

పరిశీలిస్తున్న సిఐ వేణుగోపాలరావు

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని దాశరథిపురంలో గేదెల తవిటినాయుడు ఇంట్లో బుధవారం పట్టపగలు చోరీ జరిగింది. తవిటినాయుడు ఇద్దరు పిల్లలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఉదయం వెళ్లిపోయారు. అనంతరం భార్య పద్మను తీసుకొని పొలంలోని వరి కోతలకు వెళ్లిపోయాడు. సుమారు 11 గంటల సమయంలో ఇంటికి వచ్చి చూడగా తలుపుకున్న తాళం పగలుగొట్టి ఉంది. వెంటనే ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని బంగారం వస్తువులైన హారం, నక్లెస్, చెవి దుద్దులు, ఎత్తు గొలుసులు, రూ.50 నగదు చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. సిఐ ఆర్.వేణుగోపాలరావు, సిబ్బంది, క్లూస్ టీమ్ వెళ్లి ఫింగర్ ప్రింట్‌లను పరిశీలించారు. తవిటినాయుడు ఫిర్యాదు మేరకు హెచ్‌సి కె.ధర్మారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ మోసంపై ఫిర్యాదు

టెక్కలి రూరల్: మండలం రంగాపురం గ్రామానికి చెందిన పెద్దింటి శ్రీనివాసరావు అనే ప్రైవేట్ ఉద్యోగి ఆన్‌లైన్ సైబర్ మోసానికి గురయ్యాడు. ఆన్‌లైన్‌లో జాబ్ చేస్తే వేల రూపాయలు చెల్లిస్తామని సైబర్ కేటుగాళ్లు నమ్మించి ఈ నెల 11, 12 తేదీల్లో బాధితుడి నుంచి రూ.4లక్షలు కాజేశారు. మోసపోయానని గుర్తించిన బాధితుడు బుధవారం టెక్కలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

పంట పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

పంట పొలాలు పరిశీలన

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని మాకన్నపురంలో జాతీయ నమూనా సర్వే అధికారులు బుధవారం పర్యటించారు. విశాఖపట్నానికి చెందిన అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్ బాబు ఆధ్వర్యాన జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.శ్రీధర్, గణాంక శాఖ అధికారులు కె.వి.సురేష్, పి.సి. నంద, లక్ష్మి, భాస్కరరావు, రమ్య సర్వే నంబర్ల వారీగా వరి పంట నమోదు చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్‌బాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర గణాంకశాఖలో నమోదు చేస్తున్న పంటల వివరాలు గణాంకశాస్త్ర పరిధిలో కచ్చితంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు టి.భవానీశంకర్, జగన్మోహనరావు, ఎఒ నరసింహమూర్తి పాల్గొన్నారు.

ఆర్థికసాయం చేస్తున్న సర్పంచ్ భూషణ్‌రెడ్డి

వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

నరసాపురం పంచాయితీ ఆకుల సతివానిపేటకు చెందిన యర్నాగుల చంద్ర శేఖర్ అనారోగ్యంతో మరణించగా నామిని భార్య లక్ష్మికి వైఎస్ఆర్ బీమా తక్షణసాయం రూ.10 వేలు సర్పంచ్ దుక్క భూషణ్ రెడ్డి చేతుల మీదుగా బుధవారం అందజేశారు. కార్యక్రమంలో తోటాడ సర్పంచ్ ప్రతినిధి యర్నాగుల రామరాజు, వైసిపి నాయకులు రాజు, పంచాయతీ కార్యదర్శి ఎస్.మల్లేశ్వరరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ అన్నెపు మాధవి, వాలంటీర్ ఉషారాణి ఉన్నారు.

నేడు టిడిపి కార్యాలయం ప్రారంభం

పొందూరు: పట్టణంలో పాత టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ కార్యాలయం ఆవరణలో టిడిపి నూతన కార్యాలయాన్ని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ గురువారం ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిగులపల్లి రామ్మోహన్ తెలిపారు. ఉదయం 9 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

యాత్రను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- రణస్థలం

సామాజిక సాధికారిక బస్సుయాత్రను జయప్రదం చేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. మండలంలో జెఆర్.పురం సచివాలయం-2 పరిధిలో బుధవారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి సామాజిక సాధికార బస్సు యాత్ర కార్యక్రమం చిలకపాలెంలో ఈ నెల 27న జరుగుతుందని, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి టొంపల సీతారాం, జెసిఎస్ ఇన్‌ఛార్జి చిల్ల వెంకటరెడ్డి, వైస్ ఎంపిపి రాయపురెడ్డి బుజ్జి, కో-ఆప్షన్ సభ్యులు సైదులు, జెఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, వైసిపి నాయకులు ఇడదాసుల తిరుపతిరాజు, పిన్నింటి సత్యంనాయుడు, దన్నాన సీతారాం, టేకి బ్రహ్మాజి, గుదే శారద, మింద్రాన రామారావు, సాయి, కరిమజ్జి భూషణ్ పాల్గొన్నారు.

ఎండిపోయిన పంటలను పరిశీలిస్తున్న అధికారులు

పంట నష్టాన్ని ప్రభుత్వానికి నివేదిస్తాం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వర్షాభావ పరిస్థితులు కారణంగా ఎండిపోయిన పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని జిల్లా వ్యవసాయశాఖ సంచాలకులు కె.శ్రీధర్ తెలిపారు. బుధవారం మండలంలో గరుడుభద్ర, వజ్రపుకొత్తూరు పంచాయతీల్లో ఎండిపోయిన పంట పొలాలను రైతులు, అధికారులతో కలిసి పరిశీలించారు. మండలంలో పూర్తిస్థాయిలో వరి పంట నాశనమైందన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. రైతులు తమ కష్టాలను వ్యవసాయ శాఖ అధికారులకు మొరపెట్టుకున్నారు. గరుడుభద్ర సర్పంచ్ గూడ ఈశ్వరరావు మాట్లాడుతూ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని కోరారు. రైతులు పూర్తిగా అప్పులు ఉబిలో కూరుకు పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆమదాలవలస ప్రాంతీయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ రాజశేఖర్, అమరజ్యోతి, పలాస వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎల్‌వి మధు, మండల ఎఒ కిరణ్వాని, ఎఇఒ జ్యోత్స్న, రైతులు పాల్గొన్నారు.

కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చిరంజీవి నాగ్

50 కుటుంబాలు వైసిపిలో చేరిక

ప్రజాశక్తి- బూర్జ

మండలం లాభాం గ్రామానికి చెందిన సుమారు 50 కుటుంబాలు వైసిపిలో చేరారు. మాజీ సర్పంచ్ పప్పల వెంకటరమణతో పాటు లావేటి రాంబాబు, కింబూరి అప్పలనాయుడు, అంపోలు సూర్యనారాయణ, మెట్ట వెంకటరమణ, లావేటి శ్రీరామ్మూర్తితో పాటు పలువురు రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ ఆధ్వర్యంలో వైసిపిలో చేరారు. చిరంజీవి నాగ్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బగాది నారాయణమూర్తి, మాజీ ఎఎంసి చైర్మన్ మామిడి ప్రభాకర్ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు

పశువుల అక్రమ రవాణా

కవిటి: మండలం కరాపాడు టోల్ ప్లాజా వద్ద బుధవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు పశువుల అక్రమ రవాణా గుర్తించి పశువులతో పాటు సంబంధిత వాహనం, వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ రాము అందించిన సమాచారం మేరకు బుధవారం సాయంత్రం తనిఖీలు చేస్తున్న సమయంలో ఇచ్ఛాపురం వైపు నుంచి వస్తున్న పికప్ వాహనం తనిఖీ చేయగా వాహనంలో 9 ఆవులు, ఎద్దులను గుర్తించినట్టు తెలిపారు. దీంతో వాహనం సీజ్ చేసి, పశువులను బారువ గోశాలకు పంపించినట్లు తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి - వీరఘట్టం

క్రీడలతోనే ఆరోగ్యంతో పాటు ఉల్లాసంగా ఉంటుందని సర్పంచ్ మిడతాన కల్యాణి విద్యార్థులకు సూచించారు. బుధవారం మండలం వండవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పరికరాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను కోరారు. వంట ఏజెన్సీలకు పాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సూర్యనారాయణ, పిఇటి పోలిరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - వీరఘట్టం

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎంపిపి డి.వెంకటరమణనాయుడు అన్నారు. బుధవారం స్థానిక సచివాలయం-4 పరిధిలో జరిగిన అభివృద్ధి పనులు వివరించారు. ఇందుకు సంబంధించి వివిధ రకాల పథకాలు రూ.17,34,28,000 ఖర్చు చేసినట్లు నివేదిక ప్రజల ముందు ఉంచారు. కార్యక్రమంలో సర్పంచు పి.గౌరమ్మ, పార్టీ జిల్లా కార్యదర్శి కె.ప్రేమభూషణరావు, మేజర్ పంచాయతీ ఇఒ వి.రామచంద్రరావు, పిఎసిఎస్ డైరెక్టర్ భోగి మాణిక్య చంద్రశేఖర్, ఎఎంసి డైరెక్టర్ కె.ఆంజనేయులు, ఎంపిటిసిలు మంతెన హేమలత, బండి నిరోషా, సచివాలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శన

శ్రీకాకుళం అర్బన్ : పుస్తక ప్రదర్శనను పరిశీలిస్తున్న సువర్ణ

కొత్తూరు : విద్యార్థులతో మాట్లాడుతున్న హెచ్ఎం ప్రసాదరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుదవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ ఈ ప్రదర్శనను ప్రారంభించారు. అనతరం డాక్టర్ వెలగ వెంకటప్పయ్య రచించిన తెలుగు జాతి రత్నాలు, పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య జీవిత చరిత్ర పుస్తకాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజ్ఞాన దీపాలైన గ్రంథాలయాలను ప్రతిఒక్కరూ పదిలంగా కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కవి, వక్త జంధ్యాల శరత్‌బాబుచ గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజు, శంకరరావు, జూనియర్ అసిస్టెంట్ కె.చిరంజీవులు, ఎస్.వి.రమణమూర్తి పాల్గొన్నారు.

గ్రంథాలయాల వల్ల ఎంతో ప్రయోజనం

కళాశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థీ ఖాళీ సమయాల్లో వృథాగా గడపడం కంటే గ్రంథాలయాల్లో పుస్తకాలతో గడపడం ఎంతో ప్రయోజన కరమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ పేర్కొన్నారు. ఆర్ట్స్ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. పుసకాన్ని నేస్తంగా భావించి నిరంతరాయంగా వెంట తీసుకెళ్లాలని, అప్పుడు చదువుపై ఆసక్తి పెరుగుతుందని అన్నారు. గ్రంథాలయాల్లో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంటాయని, వాటిని నిరంతరం చదువుకోవడం వల్ల విజ్ఞానం పెరిగి పోటీ పరీక్షల్లో ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో విశ్రాంత లైబ్రేరియన్ ఎస్.పాపారావు, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.హరిత, వైస్ ప్రిన్సిపాల్ ఎం.వి.సత్యనారాయణ, గ్రంథాలయ విభాగాధిపతి ఎం.ఇందువదన, గ్రంథాలయ కమిటీ సభ్యులు డాక్టర్ ఒ.రామారావు, డాక్టర్ ఎ.సూరిబాబు, పి.నారాయణరావు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

లావేరు: గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి గాయత్రి, జెడ్‌పిహెచ్ ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు మీసాల శ్రీనివాసరావు, గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, సహాయకులు గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: ధర్మవరం శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల సందర్భంగా సమాజంలో గ్రంథాల ఆవశ్యకత అనే అంశంపై చర్చా వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి బగ్గు రాజారావు, పాతూరి నాగభూషణం, యువజన సంఘం అధ్యక్షులు రుప్ప లక్ష్మ నాయుడు, రుప్ప రమేష్ నాయుడు, గ్రంథాలయాధికారి మలిపెద్ది చంద్రశేఖరరావు, సహాయకులు సూర్యనారాయణ, ప్రకాష్, జగదీష్, సూరిబాబు, కిరణ్, మహేష్, శంకర్, శేఖర్, మధు, రంగారావు, మణికంఠ, ఆశా కుమార్, నవీన్, వాసు, విద్యార్థులు పాల్గొన్నారు.

నౌపడ: నౌపడ శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి రూపావతి ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ఆదర్శ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అప్పలరాజు, ఉపాధ్యాయులు మార్కండేయ ఆధ్వర్యంలో గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సహాయకులు ప్రసాద్, పాఠకులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: స్థానిక గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జయలక్ష్మి, గ్రంథాలయాధికారి పూర్ణ చంద్ర బెహరా, సత్యనారాయణ, శారద, తేజేశ్వరరావు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నందిగాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు సందర్భంగా గ్రంథాలయాధికారి ఎస్.ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో పుస్తకప్రదర్శన నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల, హైస్కూల్ విద్యార్థులను సీనియర్స్, జూనియర్స్‌గా విభజించి "చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కురమాన బాలకృష్ణారావు, ఎంపిటిసి ప్రతినిధి అంబోడి విష్ణు, ఉపాధ్యాయులు రాములమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

నందిగాం : పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

నౌపడ : గ్రంథాలయంలో పుస్తకాలను చదువుతున్న విద్యార్థులు

కొత్తూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి టి.ఇందిర అధ్యక్షతన వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులచే పుస్తకాలు ప్రదర్శన నిర్వహిచారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రసాదరావు, సిబ్బంది లక్ష్మి పాల్గొన్నారు.

పొందూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో కథలు, పోటీ పరీక్షలకు సంబంధించిన వివిధ పుస్తకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి సిహెచ్ వెంకటేష్, పాఠకులు పాల్గొన్నారు.

కరువు మండలంపై ఏకగ్రీవ తీర్మానం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వర్షాభావ పరిస్థితులు వంశధార శివారు ప్రాంతాలకు నీరు అందక పంటలు పండలేదని, దీంతో కరువు మండలంగా ప్రకటించాలని సర్పంచ్‌లు అట్టాడ గోపి, తమ్మినేని ఢిల్లీరావు, కొల్లి భాస్కరరావు, కె.మల్లేశ్వరస్వామి, చింత రాజు, ఎంపిటిసి ఉరిటి కామేశ్వరరావు అధికారులను కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఉప్పరపల్లి నీలవేణి అధ్యక్షతన బుధవారం మండల సమావేశం నిర్వహించారు. సభ్యులు కోరిక మేరకు కరువు మండలంగా ప్రకటించాలని కోరుతూ ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంశధార నీరు అందకపోవడం రైతులు వ్యతికేకిస్తున్నారని అన్నారు. అధికారుల అసమర్థతతో సాగునీరు తీసుకొని రాలేకపోవడంతో మంత్రి అప్పలరాజుపై ఆ ప్రభావం పడుతుందని అనంతగిరి సర్పంచ్ మల్లేశ్వరస్వామి నిలదీశారు. దీనిపై వంశధార ఎఇ ప్రేమ్ కుమార్ బదులిస్తూ 70వ దశకంలో నిర్మించిన కాలువలు శిథిల దశకు చేరుకున్నాని అన్నారు. కాలువల ఆధునికీకరణ కోసం రూ.900 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించామని అన్నారు. పూడికతీత పనుల కోసం తాత్కాలికంగా రూ.2 కోట్లు అవసరమని ప్రభుత్వానికి రెండేళ్లుగా నివేదించినా గ్రాంట్స్ రావడం లేదన్నారు. పూడికతీత పనులు చేపడితేనే కాలువలో నీటి ప్రవాహం పెరిగి శివారు వరకు సాగునీరు అందుతుందన్నారు. ఎండిన పంట నివేదికను ప్రభుత్వానికి అందజేశామని ఎఒ కిరణ్ వాణి తెలిపారు. తామాడపేట అంగన్వాడీ కేంద్రం శిథిలావస్థపై ఉన్నతాధికారులకు నివేదించినట్లు సూపర్‌వైజర్ ధనలక్ష్మి తెలిపారు. తీర ప్రాంతంలో రోడ్ల నిర్మాణానికి అటవీశాఖ అధికారులు సహకరించాలని ప్రత్యేక ఆహ్వానితుడు ఉదయ్ కుమార్ కోరారు. కొబ్బరి పునరుద్ధరణ పథకం కోసం రైతులు ముందుకు రావాలని హెచ్ఒ సునీత తెలిపారు. సమావేశంలో తహశీల్దార్ బి.అప్పలస్వామి, ఇఒపిఆర్‌డి డి.తిరుమలరావు, వైస్ ఎంపిపి వంక రాజు, సర్పంచ్‌లు దున్న బాలరాజు, వంక చిరంజీవి, సుశీల, పిట్ట గీతారాణి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి నీలవేణి

అప్పన్న కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంజిఆర్

'ఎంజిఆర్' పరామర్శ

ప్రజాశక్తి- కొత్తూరు

మండలం ఆకులతంపర గ్రామానికి చెందిన సర్పంచ్ ప్రతినిధి, టిడిపి నాయకులు నాగళ్ల అప్పన్న మాతృమూర్తి నాగళ్ల అప్పలమ్మ ఇటీవలే అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న పాతపట్నం నియోజవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ప్రముఖ సామాజికవేత్త మామిడి గోవిందరావు బుధవారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఈయనతో పాటు టిడిపి ప్రధాన కార్యదర్శి కోవిలాపు కృష్ణమాచార్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాగాన మన్మధరావు, మండల యువ నాయకులు ఆంపిలి పోలినాయుడు, ముగడ భద్రయ్య, జంక పాపారావు, జంక తిరుపతిరావు, ఎస్.నరసింహ పాల్గొన్నారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి

ప్రజాశక్తి- పలాస

వరి పంటకు సకాలంలో సాగునీరు అందక, వర్షాలు కురవక పంటలు నాశినమయ్యాయని, దీన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని అఖిల భారత కిసాన్ మహాసభ జిల్లా కన్వీనర్ మద్దిల రామారావు డిమాండ్ చేశారు. ఆర్‌డిఒ కార్యాలయం వద్ద బుధవారం సిపిఐ ఎంఎల్ లిబరేషన్, అఖిలభారత కిసాన్ మహాసభ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయం ఎఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంచిలి, సోంపేట మండలాల్లో పూర్తిగా నాట్లు వేయలేదన్నారు. ఎండిపోయిన పరిస్థితి చూశామని అన్నారు. పలాస నియోజకవర్గ మండలాల్లో రైతులకు పూర్తిస్థాయి పెట్టుబడి పెట్టినాక, చేతికిచ్చిన పంట పూర్తిగా ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు అప్పులు ఊబిలో కూరుకు పోయాడని, ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు పక్షపాతి ప్రభుత్వమని చెప్పిన జగన్ ప్రభుత్వం పొలాల్లో క్షేత్ర స్థాయిలో కూడా పరిశీలించలేదని అన్నారు. నష్ట పరిహారం అంచనా వేసి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నష్ట పోయిన ప్రతి రైతుకూ రూ.50 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించి రోజుకు రూ.600 ఇవ్వాలన్నారు. వ్యవసాయ రుణాలు మాఫీ చేయాలన్నారు. ఎత్తిపోతల పథకం కింద ఇచ్ఛాపురం వరకు సాగునీరు అందించాలన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న రామారావు

కార్యక్రమంలో సీనియర్ నాయకుడు వంకల అప్పయ్య, మద్దిల రాజారావు, జోగారావు, మామిడి జానికరావు, తవిటయ్య, పోతనపల్లి దేవరాజు, సార.పాపయ్య, వంకల పున్నయ్య, మద్దిల పాపారావు, మహిళా నాయకులు కోనారి ఈశ్వరమ్మ, మద్దిల తులసమ్మ, పోతనపల్లి మీనా, బైనపల్లి జానికమ్మ పాల్గొన్నారు.

రాజును అభినందిస్తున్న హెచ్ఎం రామం

సాఫ్ట్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గుంటూరు జిల్లా బాపట్లలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 బాలబాలికల సాఫ్ట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో కోటపాలెం జెడ్‌పి హైస్కూల్ విద్యార్థి వి.రాజు ప్రతిభ కనబరచి విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.రామం, వ్యాయామ ఉపాధ్యాయురాలు సిహెచ్.భాగ్యలక్ష్మి ఉపాధ్యాయులు అభినందించారు.

భవిత కేంద్రం సందర్శన

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు భవిత కేంద్రాన్ని సహితవిద్య జిల్లా కో-ఆర్డినేటర్ బుడుమూరు గోవిందరావు బుధవారం సందర్శించారు. భవిత కేంద్రంలో వున్న దివ్యాంగ చిన్నారులతో కలిసి ముచ్చటించారు. అనంతరం రికార్డులును పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈయనతో పాటు సహిత విద్య ఉపాధ్యాయులు దినేష్, రాధారాణి ఉన్నారు.

చిన్నారులతో ముచ్చటిస్తున్న కో-ఆర్డినేటర్ గోవిందరావు

పలువురికి ఆర్థికసాయం

ఆర్థికసాయం చేస్తున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని లొద్దపుట్టిలో దీపావళి రోజున చాకలి అప్పారావు ఇల్లు కాలిపోయింది. విషయం తెలుసుకున్న జనసేన నియోజకవర్గ నాయకులు లొల్ల రాజేష్ కొద్ది రోజులకు సరిపడ నిత్యావసర వస్తువులు, కొంత నగదును అందించి దాతృత్వం చాటుకున్నారు.

ఈ నెల 11 12 తేదీల్లో తిరుపతిలో తిరుమల స్పోర్ట్స్ కాంప్లెక్స్ జరిగిన స్కూల్ గేమ్ ఫెడరేషన్ అంతర్ కళాశాల అండర్-19 స్విమ్మింగ్ సెక్షన్లలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు సింహాచలం బెహరా, గోవింద బెహరా, తరుణ్ బెహరాలకు బత్తుల వెంకటరమణ, లోహిదాస్, నాగరాజు, అంజి, నీలపు శ్రీను, బత్తుల రామారావులు నగదు అందజేశారు.

స్థానికంగా ఉన్న శకుంతలకు నేత్ర వైద్య పరీక్షల ఖర్చులకు జ్ఞాన భారతి విద్యాసంస్థ విద్యార్థులు విరాళాలు సేకరించారు. జ్ఞాన భారత సీనియర్ సెకండ్రీ స్కూల్ విద్యా సంస్థ యజమాన్యం, ఉపాధ్యాయులు రూ.10,540 నగదును అందజేశారు. కార్యక్రమంలో జ్ఞానభారతి విద్యా సంస్థల కార్యదర్శి జోహార్‌ఖాన్, పాఠశాల ఎగ్జిక్యూటివ్ ట్రస్టు వి.రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐ-బా పండా, హెడ్ మిస్టస్ రషీదాసుల్తానా, ఎఒ ప్రేమ్ సర్తాజ్‌ఖాన్ పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న గౌతు శిరీష

శిరీష పరామర్శ

ప్రజాశక్తి- పలాస

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో 3వ వార్డుకు చెందిన కొండే రామ్మూర్తి కుటుంబాన్ని బుధవారం రాత్రి టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే 15వార్డుకి చెందిన గెంబలి శంకరరావు ప్రమాదవశాత్తు కాలికి గాయం కావడంతో విషయం తెలుసుకున్న శిరీష పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆమెతో పాటు టిడిపి నాయకులు లొడగల కామేష్, 3వ వార్డు ఇన్‌ఛార్జి నర్సింహులు, సవర రాంబాబు, పట్టణ అధ్యక్షులు బడ్డ నాగరాజు, వార్డు ఇన్‌ఛార్జి నాబిల్లి శ్రీను, టున్నా మహారణ ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయ కూరగాయల్లో ఏటిఎం మోడల్

ప్రజాశక్తి- రణస్థలం

ప్రకృతి వ్యవసాయ కూరగాయల్లో ఎటిఎం మోడల్ వల్ల మంచి పౌష్టికాహారం లభిస్తుందని డిఎంఎంటి జి.రాంబాబు రైతులకు సూచించారు. మండలంలో దేవరాపల్లి గ్రామంలో దుర్గాసి శివ, గణేష్ పొలంలో కూరగాయల్లో ఎటిఎం మోడల్ బుధవారం వేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మోడల్‌లో దుంప జాతి క్యారెట్, బీట్రూట్, ముల్లంగి, కాయగూరలు వంగ, టమోట, మిరప, తీగజాతిలో ఆనప, బీర, కాకర, అన్ని రకాల కూరగాయలు తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటలు పండించవచ్చునని రైతులకు తెలిపారు. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ రకాల పంటలు వేయడం వలన నిరంతరాదాయం పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పి.సత్యనారాయణ, సూర్యకాంతం, సత్యవతి, జ్యోతి రాజు, సునీత పాల్గొన్నారు.

కూరగాయల విత్తనాలను నాటుతున్న ప్రకృతి వ్యవసాయాధికారులు

గరుడభద్రలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని గరుడభద్రలో సర్పంచ్ గూడ గిరిజ, ఈశ్వరరావు ఆధ్వర్యాన బుధవారం పారిశుధ్య పనులు చేపట్టారు. కార్తీక మాసం సందర్భంగా తాగునీరు కోనేరు వద్ద ప్రొక్లెయినర్‌తో చెత్తా చెదారాలను తొలగించి దూరంగా పారివేశారు. ఈ సందర్భంగా షైనింగ్ స్టార్ యువజన సంఘం సభ్యులు సహకారం అందించారు. కార్తీకమాసంలో మహిళలు తాగునీటి కోనేరును ఎక్కువగా ఉపయోగించేందుకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంతోష్ కుమార్, మహేష్, నగేష్ పాల్గొన్నారు.

అంగన్వాడీలో అన్నప్రాసన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలం మందపల్లి పంచాయతీ భవానీ పురం అంగన్వాడీ కేంద్రంలో వినూత్న కార్యక్రమాలు చేస్తూ పలువురితో ప్రశంసలు అందుకున్నారు. అంగన్వాడీ కార్యకర్త నరసమ్మ అధ్వర్యంలో చిన్నారులకు అలానా పాలనాలో ఆసక్తికరమైన బోధన పద్ధతులు చేస్తు చిన్నారులకు ఉత్సాహపరుస్తున్నారు. అందులో భాగంగా అప్పుడప్పుడు చిన్నారుల పుట్టిన రోజు వేడుకలు, అక్షరాభ్యాసాలు, అన్నప్రాసన కార్యక్రమాలు చేపడుతున్నారు. సామూహిక కార్యక్రమాలు చేస్తున్న నరసమ్మ బాధ్యతకు అభినందిస్తున్నారు.